# గైర్ హాజర్‌లో

విమానం సకాలంలోనే వాలింది.

రాజావారిని రిసీవు చెయ్యటానికి అన్ని పార్టీల ప్రతినిధులూ విమానాశ్రయానికి వచ్చారు. జాతీయ సమైక్యత సాధించామనటానికి ఇంకే నిదర్శనం కావాలి?

"ఓహో, మీరూ వచ్చారా?" అన్నారు రాజావారు నన్ను చూసి. అందులో ఎంత అర్థమైనా ఉన్నది ఆలోచించేవాడికి. మిగిలినవారు రావటం లాంఛనం. నేను రావటం ఆత్మీయత.

మహారాజావారి గైర్ హాజర్‌లో దిబ్బలో చాలా పరిణామాలు జరిగాయి. వాటిని గురించి అధికార పూర్వకంగా ఉత్తరాలు వెళ్లే ఉంటాయి. అయినా నా నోటి మీదుగా విన్నదారి వేరు.

అదే విధంగా తూర్పు యూరప్‌లో కూడా చాలా పరిణామాలు జరిగాయి. వాటిని గురించి పత్రికల్లో చదివాం. కాని ఆయన నోటిమీదుగా విన్నదారి ఎలాగైనా వేరే.

ఎంతమంది అయితే రాజావారిని రిసీవు చెయ్యటానికి వచ్చారో అంతమందీ - రాదర్, అంతమందిమీ - హోటల్ బార్‌లో ఆయనను అంటిపెట్టి ఉన్నట్టు గమనించాను.

రాజావారిని అందరూ తలా ఒక ప్రశ్నా వేస్తున్నారు.

కొసీగిన్ గారు బాగున్నారా?

తమకు బ్లాక్‌సీ కానియాక్ చాలా ఇష్టమనుకుంటాను?

యెప్తు షేంకకు నోబెల్ ప్రైజు వచ్చి ఉండవలసిందని మాస్కో వర్గాలు అనుకున్న మాట నిజమేనా?

కొత్త బాలే - దాని పేరేమిటీ? - సందర్శించారా?

టి.యు - 144 టెస్ట్‌ఫ్లైట్ జరిగినప్పుడు తమరు అక్కడే ఉన్నారు గదూ?

కొందరు గృహచ్ఛిద్రాలు కూడా ప్రస్తావించారు. వీళ్లు జర్నలిస్టు రాక్షసులు.

"దిబ్బలో కమ్యూనిస్టు విజృంభణకు కారణమేమంటారు?"

రాజావారు 'ఏమిటి వీడి ఉద్దేశం?' అన్నట్టు నాకేసి చూశారు.

"ఆ ప్రశ్నకు రాజావారి కన్న నేను సరయిన సమాధానం ఇవ్వగలను. నేను తిన్నగా దిబ్బ నుంచే వస్తున్నాను. మీరు చెప్పేది కమ్యూనిస్టుపార్టీల సంఖ్య బధాయించటం గురించి అనుకుంటాను. దిబ్బలో ఈనాడు అయిదు కమ్యూనిస్టు పార్టీలున్న మాట నిజమే. దాన్ని తెలిసిన వాళ్లెవరూ కమ్యూనిస్టు విజృంభణ అనరు. దిబ్బలో కమ్యూనిస్టుల సంఖ్య ఎంత మాత్రమూ పెరగలేదు. అంతో ఇంతో తగ్గింది.

"దిబ్బ కమ్యూనిస్టు చరిత్ర సంగ్రహంగా సమీక్షిస్తాను. క్రూశ్చావ్ హయాంలో ఒక కమ్యూనిస్టు పార్టీ రెండయింది. దాన్ని రష్యా పార్టీ, చీనా పార్టీ అన్నారు. ఒకటి రెండవుతుంది అన్న మార్క్సిస్టు సూత్రం ప్రకారం రెండు పార్టీలూ నాలుగయాయి. రెండు రష్యా పార్టీలూ, రెండు చీనా పార్టీలూను. ఈ అయిదు పార్టీలకూ ఒకటంటే ఒకటికి పడదు. వాళ్ల రాజకీయాల్లో ఇవాళ ఇతర పార్టీలేవీ లేవు. అందరూ లెనిన్‌నూ, మార్క్సునూ ఉదహరిస్తారు. వాళ్లకు జనంతో ఆటే పనిలేదు, జనానికి వాళ్లతోనూ అంతగా పనిలేదు. అన్ని పార్టీల మహాసభలకూ జనం విరగబడి వస్తారు. దీన్ని ఎవరైనా కమ్యూనిస్టు విజృంభణ అని ఎలాగంటారో నాకు తెలీకుండా ఉంది."

ఇంకో జర్నలిస్టు రాజావారి మీద మరొక ప్రశ్న విసిరాడు.

"నాలుగో ప్రణాళికలోనైనా దిబ్బను పారిశ్రామికంగా పైకి తెచ్చే యత్నాలు జరుగుతాయా?"

ఈసారి నేనే రాజావారి కేసి చూశాను. ఆయన కానిమ్మన్నట్టు తల ఆడించాడు.

"దిబ్బ అదివరకే సంపూర్ణంగా పారిశ్రామికమయింది" అన్నాను.

"నిజంగానా?... అన్ బిలీవబుల్!... మొదటిసారి వింటున్నాం..." అన్నాయి అనేక కంఠాలు.

"గత ఇరవై ఏళ్ల చిల్లర కాలంలో దిబ్బ నుంచి నలుగురు ఇంజనీర్లు తయారయారు. అందులో ఒకరు దిబ్బ పరిశ్రమలు నెలకొల్పటంలో సహాయపడి లక్షలు గడించి, ప్రస్తుతం పార్లమెంట్ సభ్యుడుగా దిబ్బకూ, తిరుగుండానికీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ రెండున్నర సంవత్సరకాలంలోనే వారు లోక్‌సభలో నోరు విప్పలేదంటే, దిబ్బకు ఎలాంటి సమస్యలూ లేవని చెప్పకుండానే తెలిసిపోతోంది. మిగతా ముగ్గురిలో ఒకరు కెనడాకు వలస వెళ్లి అక్కడ ఒక గొప్ప వర్క్‌షాపులో ఫిటర్‌గా పని చేస్తున్నారు. మిగిలిన ఇద్దరు ఇంజనీర్లకూ పని చూపలేకుండా ఉన్నాం. దానిని బట్టి దిబ్బ పరిశ్రమలు సాచురేషన్‌కు వచ్చాయని తెలుస్తూనే ఉన్నది. ఇంజనీర్ల సెల్ఫ్ - సఫిషెన్సీ యే గద పారిశ్రామిక సమగ్రతకు గీటు రాయి? దిబ్బలో తగు మాత్రం నిరుద్యోగం కూడా ఉంది గనక, పరిశ్రమలకు అంగబలం లోటు లేదనీ, లేబరు చాలా కంపెటెటివ్‌గా ఉండి ప్రాఫిట్స్ కూడా బాగా ఉంటున్నాయనీ తమరు అనుకోవచ్చు" అన్నాను.

"తిరుగుండంవారు దిబ్బ నుంచి వేరు పడగోరుతున్నారట నిజమేనా?" అని మరో ప్రశ్న.

"అది చెప్పుకోదగినంత తీవ్రమైన సమస్య కాదు. తిరుగుండం వారికి ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్. అర్హులైన తిరుగుండ్లకు ఉద్యోగాలు ఇవ్వటం జరిగింది, కాని అర్హతగల తిరుగుండం దొరకని పక్షంలో ఉద్యోగాలను ఖాళీగా ఉంచాలనీ, కొన్ని సీట్లు ఖాళీగా ఉంచటం వల్ల కొంప మునిగేదేమీ లేదనీ వారి వాదం. అంచేత వారు ఒక ఉద్యమం లేవదీసి అయిదారు గుర్రబ్బళ్లనూ, రెండు స్టేటు జీపులనూ తగల బెట్టారు. ఒక ఆస్పత్రిని నేలమట్టం చేశారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో ముప్పై ఇద్దరు మాత్రమే మరణించారు. అందులో ఒక్కరు కూడా ఉద్యమం వాళ్లు కారనీ, చనిపోయిన వారిలో అయిదారుగురు ఆడపిల్లలూ, ఇద్దరు ముగ్గురు వీధి బడిపిల్లలూ, ఒక బ్రాహ్మణ వితంతువూ, ఇద్దరు బిచ్చగాళ్లూ ఉన్నారనీ ఒక సుదీర్ఘ వ్యాసం దిబ్బ టైమ్సులో - ది దిబ్బా టైమ్సులో - పడింది. రిపోర్టు బహిర్గతం చెయ్యకుండా ఉండే షరతు మీద దిబ్బ ముఖ్యమంత్రి గారు ఈ రాజాసాహెబ్ వారి బావమరిది గారిని ఇంక్వయిరీకి ఏర్పాటు చేశారు. తిరుగుండ రామస్వామిగారిని దిబ్బ కాబినెట్‌లోకి తీసుకునేటట్టు మాట ఇచ్చాక ఆ ఉద్యమం పూర్తిగా పోయింది. దాన్ని గురించి ఇక్కడ ఆలోచించటం అప్రస్తుతం" అన్నాను.

రాజావారి రోల్స్ వచ్చేసింది. అందరం లేచాం.

* * * * *

దారిలో నేను రాజావారి పక్కనే కూర్చొని వారి అనుభవాలు విన్నాను. సంభాషణ నేనే ప్రారంభించాను.

"ఇంతకూ జెక్ ఆక్రమణ రహస్యం ఏమిటి?" అన్నాను.

"ఈసారి బాల్టిక్ సీ కోస్ట్‌కు వెళ్లాను. బ్రహ్మాండంగా ఉంది" అన్నారు శ్రీవారు.

"డూబ్‌చెక్ -"

"అమెరికన్లు చంద్రుడిచుట్టూ తిరిగి రావటం రష్యా వాళ్లకు ఇష్టం లేదని ఓ వదంతి లేవదీశారు. అది నిజం కాదు. వాళ్లు మొదటి నుంచీ అమెరికాతో జాయింట్ ప్రోగ్రాం అమలు చెయ్యాలనే కోరుతున్నారు."

"ఫ్రెంచి, ఇటాలియన్, ఇంగ్లిష్, ఆఖరుకు యుగోస్లావ్ దేశాలన్నీ జెకోస్లొవాకియా ఆక్రమణను నిరసించటానికి కారణమేమై ఉంటుందంటారు?"

"కాని రష్యన్ ఆస్ట్రోనాట్స్ చేసినది పెద్ద ఫీటు. స్పేస్ క్రాఫ్ట్సను సంధించారు. అద్భుతం!"

"అవాంఛనీయమే కాని తప్పనిసరి అని జెక్ ఆక్రమణ గురించి కాస్ట్రో కూడా అన్నాడట. అందుచేత –"

"కొత్త సోవియట్ సూపర్ సానిక్ జెట్ విమానం ఎగరటం ప్రారంభిస్తే మాస్కో నుంచి ఢిల్లీకి రెండుగంటల చిల్లర. ఢిల్లీ నుంచి దిబ్బకు రమారమి రెండు రోజులు!"

నేను దీర్ఘంగా నిట్టూర్చి "అదే చిత్రం! మనకు ఢిల్లీకన్న ఢిల్లీకి మాస్కో చాలా దగ్గిర పడింది" అన్నాను.

***ముద్రణ : సంవేదన త్రైమాసిక, ఏప్రిల్ 1969***